


# పండుగ ఆఫర్లు భళా

**ఈ** పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ఖాతాదారులను ఆకట్టుకోవడానికి ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు పెద్ద ఎత్తునే ఆఫర్లను తెచ్చాయి. నవరాత్రులు, దుర్గాపూజ, దసరా, దీపావళి, భాయ్ దూజ్ పర్వదినాలుండటంతో రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ), క్రెడిట్ కార్డు ఖర్చులపై వడ్డీ రేట్ల సవరణ, డిస్కౌంట్లను వ్యాపారులతో కలిసి ఆయా బ్యాంకర్లు అందిస్తున్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ వార్షిక ఫెస్టివ్ బొనాంజా పేరిట ఎలక్ట్రానిక్స్, మొబైల్స్, ఫ్యాషన్, జ్యుయెల్లరీ, ఫర్నీచర్, ట్రావెల్, ఈ-కామర్స్, డైనింగ్ కొనుగోళ్లపై రూ.40,000 వరకు ఆఫర్లు, డిస్కౌంట్లను ఇస్తున్నది. క్రెడిట్/డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ల వినియోగం ద్వారా పొందవచ్చు. ఐఫోన్ 16, ఇతర యాపిల్ ఉత్పత్తులపైనా ప్రత్యేక ఆఫర్లున్నాయి. ఇక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబిల్ స్కోర్ ఆధారంగా 8.35 శాతం వడ్డీకే గృహ రుణాన్ని ఆఫర్ చేస్తున్నది. ప్రాసెసింగ్ ఫీజునూ రద్దు చేసింది. దిల్ సే ఓపెన్ సెలబ్రేషన్స్ పేరుతో యాక్సిస్ బ్యాంక్ ముందుకొచ్చింది. వివిధ రకాల బ్రాండ్లపై క్యాష్‌బ్యాక్ ఆఫర్లను పరిచయం చేసింది. ఆన్‌లైన్ షాపింగ్‌పై 25 శాతం వరకు డిస్కౌంట్‌నూ ప్రకటించింది. అలాగే ఎస్బీఐ డెబిట్ కార్డు వినియోగంపై అమెజాన్ షాపింగ్‌లో 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ అందుకోవచ్చు. గృహ, వాహన, గోల్డ్ రుణాలపై ఆకర్షణీయ వడ్డీ రేట్లను కెనరా బ్యాంక్ ప్రకటించింది. డాక్యుమెంటేషన్, ప్రాసెసింగ్ ఫీజులను ఎత్తివేసింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రత్యేకంగా 400 రోజుల రిటైల్ టర్మ్ డిపాజిట్‌ను పరిచయం చేసింది. గరిష్ఠ వడ్డీరేటు 8.10 శాతంగా ఉన్నది. కస్టమర్ల కోసం ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కూడా రకరకాల ఆఫర్లను తీసుకొచ్చింది.






# స్మార్ట్ సిప్ అదుర్స్

## రెగ్యులర్ సిప్‌తో పోల్చితే ఆకర్షణీయ లాభాలు




రెగ్యులర్ సిప్-స్మార్ట్ సిప్‌ల్లో పెట్టుబడులపై ఇప్పటిదాకా వచ్చిన రాబడుల మధ్య తేడాను ఒక్కసారి గమనిస్తే..(రూ.లలో)

| | | | | |
|---|---|---|---|---|
| పెట్టుబడి | 5,000 | 5,000 | 5,000 | 5,000 |
| సంవత్సరాలు | 10 | 15 | 20 | 25 |
| సిప్ రిటర్న్స్ 12% | 11,20,179 | 23,79,675 | 45,99,287 | 85,01,033 |
| స్మార్ట్ సిప్ రిటర్న్స్ 13.5% | 12,13,555 | 27,06,657 | 55,19,003 | 1,08,16,122 |
| స్మార్ట్ సిప్‌ల్లో పెరిగిన లాభం | 93,376 | 3,26,982 | 9,19,716 | 23,15,089 |

**స్టాక్** మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే చాలామందికి సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్స్) మొదటి ప్రాధాన్యతగా ఉంటాయి. ఇందులో ఎంచుకున్న కాలవ్యవధుల మేరకు మ్యూచువల్ ఫండ్ల ద్వారా నిర్దేశిత మొత్తాలను పెట్టుబడిగా పెడుతూపోవచ్చు. ఉదాహరణకు ప్రతి నెలా 5న రూ.10,000 పెట్టుబడిగా పెట్టాలని నిర్ణయిస్తే.. నెలనెలా 5న అంతే మొత్తం ఇన్వెస్ట్ చేస్తూనే ఉండాలి. మార్కెట్ పరిస్థితులతో సంబంధం లేకుండా ఇది కొనసాగుతుంది. దీర్ఘకాలంలో మీరు అధిక రాబడుల్నే అందుకోవచ్చు. అయితే ఇక్కడ 'స్మార్ట్ సిప్' అనే ఆప్షన్ కూడా ఉన్నది. మార్కెట్ పరిస్థితులనుబట్టి ప్రయోజనం పొందే వెసులుబాటు దీనిలో కనిపిస్తున్నది. ఫలితంగా ఎక్కువ లాభాలను మదుపరులు ఇందులో అందుకునే వీలున్నదని చెప్పవచ్చు.

### స్మార్ట్ సిప్ అంటే ఏమిటి?

మార్కెట్ పరిస్థితులకు తగ్గట్టు పెట్టుబడులపై ఓ నిర్ణయం తీసుకుంటూ ఆకర్షణీయ లాభాలను ఒడిసి పట్టుకునేలా రూపొందించినదే ఈ స్మార్ట్ సిప్. ఒక్కమాటలో చెప్పాలంటే సంప్రదాయ సిప్‌కు ఇదో అప్‌గ్రేడ్ వెర్షన్. స్టాక్ మార్కెట్లు లాభాల్లో ఉన్నప్పుడు పెట్టుబడులు తగ్గిస్తూ, నష్టాల్లోకి జారుకున్నప్పుడు పెంచుతూపోవచ్చు. తద్వారా రిస్కును తగ్గించుకోవచ్చని, ఇదే సమయంలో మన పెట్టుబడులపై అధిక రాబడులనూ అందుకోవచ్చని నిపుణులు చెప్తున్నారు.

### ఇదీ సంగతి..

మార్కెట్ వాల్యుయేషన్స్ ఆధారంగా పెట్టుబడి మొత్తాలను సర్దుబాటు చేస్తూ స్మార్ట్ సిప్‌లను మ్యూచువల్ ఫండ్స్ కొనసాగిస్తూ ఉంటాయి. సింపుల్‌గా చెప్పాలంటే తక్కువ కొనడం, ఎక్కువ అమ్మడం వీటి వ్యూహం. స్టాక్ మార్కెట్లు లాభాల్లో పరుగులు పెడుతున్నప్పుడు మీ మంత్లీ సిప్ (నిర్దేశిత నెలవారీ పెట్టుబడి) మొత్తం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ల్లోకి సాధారణంగానే వెళ్తుంది. కానీ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో నడుస్తున్నప్పుడు మీరు పెట్టే పెట్టుబడులు రెట్టింపవుతాయి. అంటే స్టాక్ మార్కెట్లు అప్ ట్రెండ్‌లో ఉన్నప్పుడు షేర్ల ధర ఎక్కువగా ఉంటుంది. అందుకే అప్పుడు స్మార్ట్ సిప్‌లో షేర్లను మ్యూచువల్ ఫండ్స్ మేనేజర్లు తక్కువగా కొంటుంటారు. లాభాల స్వీకరణకు పెద్దపీట వేసి ఉన్న షేర్లను అమ్మేస్తూ ఉంటారు. మార్కెట్ డౌన్ ట్రెండ్‌లో ఉన్నప్పుడు షేర్ల ధర కూడా తగ్గుతుంది. దీంతో వీలైనంత ఎక్కువగా రకరకాల షేర్లను కొనాలని మేనేజర్లు చూస్తారు. మార్కెట్లు పడుతున్నకొద్దీ ఇలా షేర్లను కొంటూనేపోతుంటారు. అందుకే స్మార్ట్ సిప్‌లో మీరు పెట్టే పెట్టుబడులు రెట్టింపవుతాయి. మార్కెట్ మళ్లీ పుంజుకున్నప్పుడు ఆ షేర్లను ఎక్కువ ధరలకు అమ్ముతారు. దీంతో పెట్టుబడులకు పెద్దగా ఆస్కారం ఉండదు. ఫలితంగా ఇన్వెస్టర్లకు లాభాలు కూడా పెరుగుతాయి. ఒకవేళ మార్కెట్లు అదేపనిగా పెరుగుతూపోతుంటే పెట్టుబడులను ఈక్విటీ స్కీముల్లో కాకుండా లిక్విడ్ ఫండ్స్‌ల్లోకి మ్యూచువల్ ఫండ్ మేనేజర్లు మళ్లిస్తారు. దీంతో ఆకస్మిక పతనాల నుంచి మదుపరులకు రక్షణ లభిస్తుంది.

### స్మార్ట్ సిప్ ఎక్కడ లభ్యం?

ప్రస్తుతం యాక్సిస్ ఏఎంసీ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, కొటక్ ఏఎంసీలు స్మార్ట్ సిప్‌లను ఇన్వెస్టర్లకు ఆఫర్ చేస్తున్నాయి. మార్కెట్ పరిస్థితులకు తగ్గట్టుగా ఈ సిప్‌ల్లో ఇన్వెస్టర్లు ఎంచుకున్న కనీస పెట్టుబడి మొత్తాలు ఒక్కోసారి రెట్టింపవుతాయని, మరోసారి తగ్గుతాయని ఆయా ఫండ్ మేనేజర్లు చెప్తున్నారు. అయితే బుల్ మార్కెట్‌లో స్మార్ట్ సిప్‌ల నుంచి రెగ్యులర్ సిప్‌ల కంటే తక్కువగా రిటర్న్స్ రావచ్చని కూడా అంటున్నారు. మార్కెట్ వాల్యుయేషన్స్ ఆధారంగా పెట్టుబడులు తగ్గడమే ఇందుకు కారణం. అయినప్పటికీ బేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెరుగుతాయి కాబట్టి ఎక్కువ రాబడులు వచ్చే వీలుందని పేర్కొంటున్నారు. అయినా.. మ్యూచువల్ ఫండ్స్ సిప్‌ల్లో పెట్టుబడులు మార్కెట్ ఒడిదొడుకులకు లోబడి ఉంటాయి కనుక అన్నీ తెలుసుకొని ఇన్వెస్ట్ చేయడమే శ్రేయస్కరం అన్నది గుర్తుంచుకోవాలి.




# గ్లోబల్ పరిణామాలు కీలకం

**దేశీయ** స్టాక్ మార్కెట్ల లాభాలకు బిగ్ బ్రేక్ పడింది. ఆల్‌టైమ్ హై శిఖరాలకు చేరుకున్న సూచీలు.. భారీ నష్టాలతో కిందకి వచ్చేశాయి. లాభాల స్వీకరణ దిశగా అడుగులేస్తున్న మదుపరులకు పశ్చిమాసియా ఉద్రిక్తతలు కూడా తోడవడంతో గత వారం ట్రేడింగ్‌లో భీకర నష్టాలే వాటిల్లాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బీఎస్‌ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 3,883.40 పాయింట్లు లేదా 4.60 శాతం క్షీణించి 81,688.45 వద్ద నిలిచింది. అలాగే ఎన్‌ఎస్‌ఈ సూచీ నిఫ్టీ సైతం 1,164.35 పాయింట్లు లేదా 4.50 శాతం పడిపోయి 25,014.60 దగ్గర ముగిసింది. ఇక వరుసగా 5 రోజులపాటు మార్కెట్లు నష్టాల్లోనే కదలాడటంతో రూ.16.2 లక్షల కోట్లకుపైగా మదుపరుల సంపద హరించుకుపోయింది. ఈ నేపథ్యంలో ఈ వారం ఆర్బీఐ ద్రవ్యసమీక్షతో పాటు ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పోరు.. పెద్ద ఎత్తునే ప్రభావితం చేస్తాయనిపిస్తున్నది. దీంతో కరెక్షన్‌కే వీలెక్కువగా ఉన్నట్టు కనిపిస్తున్నది. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారంలోనూ భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,600 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,300 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే 25,400-25,600 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

### చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు మదుపరులు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్ అని గుర్తుంచుకోవాల్సిందిగా మనవి.

# కొందామా.. ఆగుదామా?

## గోల్డ్ మార్కెట్ ట్రెండ్‌పై నిపుణుల మాటేంటి?



**బంగారం** ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం మునుపెన్నడూ లేనివిధంగా ఆల్‌టైమ్ హైల్లో గోల్డ్ రేట్లు కదలాడుతుండటం గమనార్హం. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాములు ఏకంగా రూ.78,450గా నమోదైంది. నిజానికి గతకొద్ది రోజులుగా పుత్తడి విలువ నిత్యం ఎంతో కొంత పెరుగుతూనే ఉన్నది. ఈ క్రమంలోనే చాలామందికి ముఖ్యంగా సగటు మధ్యతరగతి వర్గానికి పసిడి కొనుగోళ్లపై ఎటూ తేల్చుకోలేని సందిగ్ధతే ఏర్పడింది. కొందామా.. ఆగుదామా? అనేది తెలియక ఒకింత గందరగోళంలోనే కొనుగోలుదారులున్నారు. మరి.. గోల్డ్ మార్కెట్ ట్రెండ్‌పై నిపుణుల మాటేంటి?

### పండుగ సీజన్‌లో పైపైకే..

ఈ పండుగ సీజన్‌లో ధరలు మరింత పెరిగేలానే ఉన్నాయని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ అంచనా వేస్తున్నారు. నవరాత్రులు, దసరా, దీపావళి, క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి ఇలా వరుసగా పండుగలున్న నేపథ్యంలో మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగానే ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. పైగా ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు, గ్లోబల్ మార్కెట్‌లో ఎగబాకుతున్న ముడి చమురు ధరలు, దేశ-విదేశీ స్టాక్ మార్కెట్ల పతనం వంటివి ఇన్వెస్టర్లను సహజంగానే గోల్డ్‌వైపు తిప్పుతున్నాయి. బంగారాన్ని రక్షణాత్మక పెట్టుబడిగా చూస్తుండటంతో ఇన్వెస్టర్ల నుంచి పెరిగే డిమాండ్ కూడా మార్కెట్‌లో ధరలను పరుగులు పెట్టిస్తుందని అంటున్నారు. దీంతో మరో 3-4 నెలలదాకా గోల్డ్ రేట్లు తగ్గకపోవచ్చనే అంచనాలే కనిపిస్తున్నాయి.

### కరెక్షన్ ఎప్పుడు?

గోల్డ్ మార్కెట్‌లో కరెక్షన్ ఎప్పుడన్నదానికి పశ్చిమాసియాలో ఉద్రిక్తకర వాతావరణం చల్లబడాలని, స్టాక్ మార్కెట్లు తిరిగి లాభాల బాట పట్టాలని, అప్పుడే బంగారం ధరలు దిగివచ్చే వీలుందన్న సమాధానాలు వినిపిస్తున్నాయి. ఇప్పుడున్న ధరల్లో 5 నుంచి 7 శాతం మేర తగ్గవచ్చని చెప్తున్నారు. మొత్తానికి మదుపరులు తిరిగి తమ పెట్టుబడులను స్టాక్స్, బాండ్లవైపు మళ్లిస్తేనే గోల్డ్ రష్ తగ్గుతుందని అంటున్నారు. దీంతో ఇప్పట్లో బంగారం కొనుగోళ్ల జోలికి పెద్దగా వెళ్లకపోవడమే లాభదాయకమన్న రీతిలో నిపుణుల స్పందన ఉంటున్నది. అయితే స్వల్ప కాలానికి చూస్తే ధరలు పెరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నందున ఇప్పుడు కొని కొద్ది రోజుల తర్వాత అమ్ముకోవచ్చని కూడా సూచిస్తున్నారు. కానీ మార్కెట్ ట్రెండ్‌కు లోబడి రిస్కును ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

